క్లుప్తంగా

రక్తదానం



రక్తదానం చేస్తున్న సాధన యువజన సంఘ సభ్యులు

నెల్లిమర్ల: సాధన యువజన సంఘ సభ్యులు హార్ట్ సర్జరీ పేషెంట్‌కి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. జరజాపుపేటకు చెందిన నల్లి తిరుపతి విజయనగరంలోని తిరుమల ఆస్పత్రిలో గుండె సంబంధిత చికిత్స తీసుకుంటున్నాడు. ఈయనకు శస్త్రచికిత్స చేయడానికి రక్తం అవసరం కావడంతో కుటుంబ సభ్యులు సాధనా యువజన సంఘ సభ్యులను సంప్రదించారు. దీంతో సంఘ అధ్యక్షుడు పాలుబోతు దుర్గాప్రసాద్ సూచన మేరకు నల్లి రాధాకృష్ణ, బుగత గిరి స్థానిక రోటరీ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేసి రోగి బంధువులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను పలువురు అభినందించారు.

పైప్‌లైన్ పనుల అడ్డగింత

పూసపాటిరేగ: మండలంలోని కొణతాలపాలెం గ్రామ సమీపంలో కందివలస గెడ్డ వద్ద నిర్మాణంలో ఉన్న ఓ పరిశ్రమకు సంబంధించిన వ్యర్థ జలాల పైప్‌లైన్ పనులను కొణతాలపాలెం గ్రామస్తులు శుక్రవారం అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన పి.గోపితో పాటు పలువురు సంఘటనా స్థలానికి చేరుకుని పనులను నిలిపివేశారు. వ్యర్థజలాలను విడిచిపెడితే గ్రామం కాలుష్యం బారిన పడుతుందన్నారు. పరిశ్రమ ప్రతినిధులు వ్యర్థజలాలు బయటకు రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోరాడ రమణ, మోహనరావు, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కుమిలి సచివాలయం తనిఖీ

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి సచివాలయాన్ని ఎంపీడీఓ ఎం.రాధిక శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది మూవ్‌మెంట్ రిజిస్టర్, కంప్యూటర్‌లో నిక్షిప్తమైన సంక్షేమ పథకాలను పరిశీలించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్యసేవలు

● డీఎంహెచ్‌ఓ భాస్కరరావు




సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: గ్రామీణ ప్రాంత ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ ఎస్. భాస్కరరావు అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ఆయుష్మాన్‌భవ కార్యక్రమంపై వైద్య సిబ్బందికి శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీహెచ్‌ఓ, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. ప్రతి శనివారం ఆరోగ్య మేళాలు నిర్వహించాలని సూచించారు. అలాగే క్యాన్సర్ కేసులను గుర్తించాలన్నారు. గ్రామల్లో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. సమావేశంలో డీఐఓ అచ్యుతకుమారి, డీపీహెచ్‌ఎన్‌ఓ సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణహితంగా వినాయక చవితి..

● కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ సరిత



ఉపాధ్యాయులతో కలిసి మట్టి వినాయక ప్రతిమలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

విజయనగరం రూరల్: నీటిలో సులభంగా కరిగిపోయే మట్టి విగ్రహాలను పూజించి, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ సరిత అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, విగ్రహాల తయారీలో సహజమైన రంగులనే వినియోగించాలని, కాలుష్య కారకమైన ఆయిల్ పెయింట్లు, రసాయన రంగులను వినియోగించవద్దని సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని ఆర్టీసీ కాంప్లెక్స్, పైడితల్లి ఆలయం (మూడు లాంతర్లు), కలెక్టరేట్ కూడలి, దాసన్నపేట రైతుబజార్ కూడలి, న్యూపూర్ణ సర్కిళ్ల వద్ద మట్టి విగ్రహాలు శనివారం పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

భోగాపురం: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మట్టి వినాయక విగ్రహాలను తయారుచేసి ఉపాధ్యాయులకు శుక్రవారం అందజేశారు. ఈ నెల 18న వినాయక చవితి సందర్భంగా విద్యార్థులు మట్టి విగ్రహాలు తయారుచేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఆళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, మట్టి విగ్రహాలనే పూజించాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారయ్యే విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితం కావడంతో పాటు పర్యావరణం పాడవుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి. శివప్రసాద్, ఎం. రాజేశ్వరి, జి. చిన్నారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ఆత్మీయ స్వాగతం...



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి



ముఖ్యమంత్రికిస్వాగతం పలుకుతున్న ఎస్పీ దీపికాపాటిల్



జగనన్నతో ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి

జిల్లా కేంద్రంలోని గాజులరేగ ప్రాంతంలో రూ. 500 కోట్లతో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్యకళాశాల ప్రారంభోత్సవానికి శుక్రవారం విజయనగరం వచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, జిల్లా అధికారులు ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం







స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, విక్రమ్, ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి



స్వాగతం పలుకుతున్న జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి



సీఎంనకు బొకే అందజేస్తున్న నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



సీఎంతో మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ



ముఖ్యమంత్రితో ఎమ్మెల్సీ సురేష్‌బాబు



ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు

ఇంజినీరింగ్ ప్రతిభతో దేశ పురోగతి



మాట్లాడుతున్న కామర్స్ డిపార్ట్‌మెంట్ టీమ్ లీడ్ కన్సల్టెంట్ వి.స్వాతి



విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్ట్



విద్యుత్‌శాఖ ఎస్ఈ లక్ష్మణరావును సన్మానిస్తున్న ప్రసాదరావు



ప్రాజెక్టులను సందర్శిస్తున్న సెంచూరియన్ వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి

డెంకాడ: ఇంజినీరింగ్ ప్రతిభతో దేశం పురోగతి చెందుతుందని సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఈ కామర్స్ డిపార్ట్‌మెంట్ టీమ్ లీడ్ కన్సల్టెంట్ వి. స్వాతి అన్నారు. మండలంలోని జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఇంజినీర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రాజెక్ట్ ఎక్స్‌పో, క్విజ్, వ్యాసరచన, పేపర్ ప్రెజెంటేషన్, చిత్రలేఖనం, తదితర పోటీలు నిర్వహించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టులు, డిజైన్ పేటెంట్ ఫర్ ఆటోమేటిక్ బారియర్ వాటర్ ఫ్లడ్ గేట్ డిజైనర్ వంటి పలు అంశాలలో సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అందించిన సేవలు, చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, కళాశాల చైర్మన్ పి.మధుసూదనరావు, సెక్రెటరీ కె.శివరామకృష్ణ, వైస్ ప్రిన్సిపాళ్లు టి.హరిబాబు, కేవీ నర్సింహం, సమన్వయకర్త బి.శ్రీధర్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రాజెక్టులు

విజయనగరం అర్బన్: నగరంలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ ఇంజినీర్ల దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. తొలిత భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను అతిథులు తిలకించారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ జె.డి సుబ్బరాయశాస్త్రి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ వీఏ నాయుడు, సీహెచ్ వెంటలక్ష్మి, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి. రవికిషోర్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంజినీర్ల పాత్ర కీలకం

విజయనగరం ఫోర్ట్: సమాజంలో ఇంజినీర్ల పాత్ర కీలకమని వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు బీకేవీ ప్రసాదరావు అన్నారు. స్థానిక విద్యుత్ భవన్‌లో ఇంజినీర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ ఎస్ఈ మువ్వల లక్ష్మణరావును సన్మానించారు. కార్యక్రమంలో డోల చిరంజీవి, మీగడ మహేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌లో ఇంజినీర్స్ డే ...

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో ఇంజినీర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీకే మహంతి ముందుగా సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, ఇంజినీరింగ్ విద్యను థియరీతో పాటు ప్రయోగాత్మకంగా నేర్చుకున్నప్పుడే ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను సందర్శించి అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన నాయకులు



ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న చనమళ్లు



ముఖ్యమంత్రితో ముచ్చటిస్తున్న రేగాన

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనమళ్ల వెంకటరమణ, టూరిజం బోర్డు రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు శుక్రవారం కలిశారు. గాజులరేగలో మెడికల్ కళాశాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన అధినేతకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు.

ఆర్‌బీకే పరిశీలన



మొయిద ఆర్‌బీకేలో సిబ్బందితో మాట్లాడుతున్న నాబార్డ్ డీజీఎం నాగార్జున

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద రైతుభరోసా కేంద్రాన్ని నాబార్డు డీజీఎం టి. నాగార్జున శుక్రవారం సందర్శించారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందుతున్న సేవలపై ఈ సందర్భంగా ఆరా తీశారు. కియోస్కోతో ఎరువులు, విత్తనాల పంపిణీ, ఈ పంట నమోదును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు సకాలంలో సేవలు అందుతున్నాయన్నారు. అలాగే మండల కేంద్రంలోని అగ్రి ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను సందర్శించి విత్తనాలు, ఎరువుల పరీక్షల ప్రక్రియపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీఆర్‌సీ వ్యవసాయాధికారి సంగీత, ఏఓలు పూర్ణిమ, శ్రీలక్ష్మి, ఏఈఓ నాగరాజు, దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

● ఎంపీడీఓ రామారావు



సీతారామునిపేటలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామారావు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: సచివాలయ సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన ప్రభుత్వ సేవలను అందించాలని ఎంపీడీఓ రామారావు సూచించారు. మండలంలోని సీతారామునిపేట, గొర్లిపేట గ్రామాల్లో శుక్రవారం పర్యటించి సచివాలయం, ఆర్‌బీకే, ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఏకైక లక్ష్యంతో ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేసి మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ అరుణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందంగా ఉంది...

విజయనగరం టౌన్: విశ్వబ్రాహ్మణుల కుల దైవమైన విశ్వకర్మ భగవాన్ జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ఆనందంగా ఉందని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ జిల్లా డైరెక్టర్ జనాప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి విశ్వ బ్రాహ్మణుల కార్పొరేషన్ తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.

అభివృద్ధి పనులు వేగవంతం ● పబ్లిక్ హెల్త్ ఎస్ఈ గణపతిరావు



పనులు పరిశీలిస్తున్న పబ్లిక్ హెల్త్ ఎస్ఈ గణపతిరావు, తదితరులు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న తాగునీటి ట్యాంక్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని పబ్లిక్ హెల్త్ ఎస్ఈ పి.గణపతిరావు ఆదేశించారు. నగరంలోని బీసీ కాలనీ, కేఎల్‌పురం, ధర్మపురి ప్రాంతాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న ట్యాంక్ పనులను శుక్రవారం ఉదయం పరిశీలించారు. అనంతరం కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ, నగరంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి త్వరితగతిన టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలన్నారు. పర్యటనలో కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు, ఈఈ కె. దక్షిణామూర్తి, టెక్నికల్ ఆఫీసర్ కె.ఫణికుమార్, డీఈలు వి.జగన్‌మోహన్, ఎస్.అప్పారావు, సీహెచ్ చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల పరిశీలన

పూసపాటిరేగ: మండలంలోని సీహెచ్ అగ్రహారం రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 9లోని ప్రభుత్వభూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధురి శుక్రవారం పరిశీలించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పరిశీలనకు వచ్చిన ఆమె మాట్లాడుతూ, ఆక్రమణలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట సర్పంచ్ కొత్తకోట శ్రీరాములు, వీఆర్‌ఓ షేక్ గౌస్, తదితరులు ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను వినియోగించుకోండి..



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ సముద్రపు రామారావు

నెల్లిమర్ల: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పట్టణవాసులు వినియోగించుకోవాలని నెల్లిమర్ల నగర పంచాయతీ 2,3 వార్డుల కౌన్సిలర్లు పైల భారతి, మొయిద శ్రీనివాసరావు కోరారు. నగర పంచాయతీ పరిధిలోని కొండపేట 2,3 వార్డుల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం సర్వేలో కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యారోగ్య సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరిగి కార్యక్రమం పట్ల స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు పైల మురళి, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి..

నగర పంచాయతీ పరిధిలో వచ్చేనెల 4న ప్రభుత్వ ఉన్నత పాఠశాల(సీకేఎం)లో నిర్వహించబోయే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నగరపంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు పిలుపునిచ్చారు. స్థానిక జరజాపుపేటలోని సచివాలయం 1, 8 పరిధిలో ఉన్న సచివాలయ సిబ్బంది, వైద్యారోగ్యశాఖ సిబ్బంది, వలంటీర్లకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ మేనేజర్ టీవీఎస్ విశ్వేశ్వరరావు, కౌన్సిలర్లు టి. నారాయణమూర్తి, సచివాలయం సిబ్బంది లీలాప్రసాద్, సూర్య, తదితరులు పాల్గొన్నారు.



రామతీర్థంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు

పక్కాగా జగనన్న ఆరోగ్య సురక్ష

నెల్లిమర్ల రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పక్కాగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి వి. శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని రామతీర్థం గ్రామంలో ఆరోగ్య సురక్ష సర్వే ప్రక్రియను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఇందులో భాగంగానే ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.